ఘనం.. కోట బోనం





- ప్రారంభమైన గోల్కొండ కోట బోనాలు
- ఉదయం నుంచే కిక్కిరిసిన భక్తులు
- సందడిగా కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు


అమ్మవారి విగ్రహాలను కోటపైకి తీసుకెళ్తున్న చంటిబాబు, నాగన్న


సామూహిక ఊరేగింపులో కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తదితరులు


పోతరాజులతో చైర్మన్ కాంత అరవింద్ మహేష్ కుమార్


బంగారు బోనానికి స్వాగతం పలికి పూజలు చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మందడి అనీల్‌కుమార్


నజర్ బోనానికి సాక సమర్పించి ప్రారంభిస్తున్న మధుయాష్కీ గౌడ్



బోనాలను రాష్ట్రం గర్వపడేలా నిర్వహిస్తాం

గోల్కొండ: బోనాల ఉత్సవాలను రాష్ట్రం గర్వపడేలా నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సబ్జినగర్‌లోని నటరాజ్‌నగర్‌లోని నల్లపోచమ్మ దేవి, మహంకాళి దేవి ఆలయ బోనాల బ్రోచర్‌ను ఆమె జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోనం నిర్వహించే ప్రతి ఆలయ నిర్వాహకులకు బోనాల నిర్వహణ కోసం తాము చెక్కులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

గోల్కొండ: గోల్కొండ కోట మొదటి బోనం ధూంధాంగా ప్రారంభమైంది. గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా ఆదివారం మొదటి పూజ జరిగింది. ఉదయం 6 గంటల నుంచే భక్తులు కోటకు రావడం ప్రారంభించారు. కోటలోని నగీనాబాగ్ తదితర ప్రాంతాల్లో మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారికి నైవేద్యం తయారు చేస్తూ సందడి చేశారు. బోనం కుండలను తయారు చేస్తూ అమ్మవారి దర్శనానికి తాము ముందుగా వెళ్లాంటే ఒకరితో ఒకరు పోటీపడ్డారు. అయితే ఉదయం 10 గంటలకే కోట ప్రవేశ ద్వారం దగ్గర భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. కొద్ది సేపు భక్తుల మధ్య తొక్కిసలాట జరిగింది. మొదటి నజర్ బోనం బంజారి దర్వాజా నుంచి భారీ ఊరేగింపుతో వచ్చింది. మరో వైపు గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం ఆధ్వర్యంలో రిసాలజబార్ నుంచి రోబోటిక్ ఏనుగు అంబారీ అందరిని ఆకట్టుకుంది. సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, టోలిచౌకీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి ఇతర వృత్తిపని సంఘం వారి ఆధ్వర్యంలో సాగిన ఈ రోబోటిక్ ఏనుగు అంబారీ ఊరేగింపు మొదటి రోజు బోనాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మాకు చెప్పకుండా గవర్నర్ కార్యక్రమమా..?

గోల్కొండ: రాష్ట్ర గవర్నర్ గోల్కొండకు వస్తున్న సందర్భంగా పీస్ కమిటీ సభ్యులు, భాగ్యనగర్ బోనాల ఉత్సవ సమితి నాయకులు గోల్కొండ కోటలో ఏర్పాట్లు చేశారు. భాగ్యనగర్ బోనాల ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రాహుల్‌తో పాటు అక్కడ ఉన్న వారితో వారు వాగ్వివాదానికి దిగారు. ప్రత్యేక అతిథిగా గవర్నర్ వస్తున్నారని వినగానే పలువురు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తమకు తెలపకుండా గవర్నర్‌ను ఎలా ఆహ్వానించారంటూ స్టేజీపై ఉన్న వారిని ప్రశ్నించారు. ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రాహుల్‌తో పాటు టి.జీవన్ సింగ్, సత్యంరెడ్డి, రాజువస్తాద్ వారిని సముదాయించారు. చివరకు పోలీసులు అనుమతించిన వారినే గవర్నర్ ఉన్న వేదికపై ఆహ్వానించడం జరిగింది. వీరితో పాటు పలువురు ఉత్సవ సమితి ప్రతినిధులను సైతం ఆహ్వానించారు.

కోటకు బోనమెత్తి..

లంగర్‌హౌస్: తెలంగాణ బోనాల ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. లంగర్‌హౌస్ వాసుల చేతుల మీదుగా తొలిబోనం సమర్పించే కార్యక్రమాన్ని మంత్రులు లంగర్‌హౌస్‌లో ప్రారంభించారు. గోల్కొండ జగదాంబిక బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో చంటిబాబు, శోభాపాండే ఉత్సవాలు నిర్వహించారు. మల్లేష్ గౌడ్, నర్సింగ్‌రావు గౌడ్, వెంకటేష్ గౌడ్, అశోక్ గౌడ్ సమర్పించే బొదటి నజర్ బోనాలను మధుయాష్కీగౌడ్ సాక సమర్పించి ప్రారంభించారు. ఈ బోనాల ఉత్సవాల్లో స్థానిక నాయకులు రాజు వస్తాద్, సత్యం రెడ్డి, ఉదయ్‌కుమార్, జీవన్ సింగ్, ఎన్.శ్రీకాంత్, గరిషె నరేష్, అనిల్ కుమార్ యాదవ్‌లు పాల్గొని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

బంగారు బోనంతో సామూహిక ఊరేగింపు..

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయంలోని అమ్మవారికి బంగారు పాత్రతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోల్కొండ జగదాంబ అమ్మవారికి బోనం సమర్పించడానికి బయలుదేరారు. ఆలయం నుంచి బయలుదేరిన సామూహిక ఊరేగింపు మీరాలంమండి వీధుల్లో తిరుగుతూ మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ ప్రధాన రోడ్డు వరకు కొనసాగింది. కళాకారుల నత్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మీరాలంమండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు రాకేష్ తివారి, మధుసూదన్ గౌడ్, మధుసూదన్ యాదవ్, కె.ఎస్.ఆనంద్‌రావు,కై లాజ్ గంగపుత్ర, అనంతోజీ హన్స్‌రాజ్, కోటి రెడ్డి, ప్యారసాని వెంకటేశ్ పాల్గొన్నారు.

బంగారు బోనం సమర్పణలో గౌలిపురా కమిటీ సభ్యులు..

గౌలిపురా: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం నుంచి ఆదివారం గోల్కొండ జగదాంబ ఎల్లమ్మ అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కై లాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావు, సలహాదారులు కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు బి.వై.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుమన్ కుమార్, సుల్తాన్‌షాహీ ఆలయ అధ్యక్షుడు రాకేష్ తివారీ, ఉప్పుగూడ ఆలయ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, బంగారు మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్‌యాదవ్, కోటి రెడ్డి, రిషికేశ్ పాల్గొన్నారు.

గోల్కొండ బోనాలకు తరలిన కాంగ్రెస్ నేతలు

జియాగూడ: ఆషాఢ మాసంలో మొదటి బోనాలు గోల్కొండ కోటలో ప్రారంభమయ్యాయి. ఆదివారం జియాగూడ నుంచి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ ముదిరాజ్, సహా కార్యదర్శి మహేష్ బాబు, ఇతర కార్యకర్తలతో కలిసి గోల్కొండ బోనాలకు తరలివెళ్లారు. వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు.



ఎల్లమ్మ తల్లి ఆశీర్వాదంతోనే సుఖసంతోషాలు..

గోల్కొండ: ఎల్లమ్మ తల్లి ఆశీర్వాదంతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారని గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ అన్నారు. ఆదివారం గోల్కొండ కోటలో బోనాల ఉత్సవాల సందర్భంగా భాగ్యనగర్ బోనాల ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లమ్మ తల్లిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రజలు బోనాలు నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ బోనాల ఉత్సవ కమిటీ గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం వారు గవర్నర్‌ను సన్మానించి జ్ఞాపిక బహుకరించారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు డి.భగవంత్‌రావు, రాహుల్, కాంగ్రెస్ నాయకులు జీవన్‌సింగ్, సత్యంరెడ్డి, కార్పొరేటర్ డి.దర్శన్, ఉదయ్‌కుమార్, సాయిబాబాచారి తదితరులున్నారు.


గోల్కొండ అమ్మవారికి బంగారు బోనం సమర్పణలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు


వేడుకలకు హాజరైన నవీన్‌కుమార్, ఆనంద్ ముదిరాజ్, మహేష్‌బాబు తదితరులు

ఢిల్లీ బోనాలకు బయల్దేరిన లాల్‌దర్వాజా ఆలయ కమిటీ



చాంద్రాయణగుట్ట: ఢిల్లీలో ఈనెల 8, 9, 10వ తేదీలలో లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 10వ వార్షిక బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఇక్కడి నుంచి బంగారు బోనంతో బయల్దేరారు. ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా వెళ్లారు. చైర్మన్ మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పడానికి ఢిల్లీలో బోనాలు చేయడం జరుగుతుందన్నారు. 8న ఫొటో ఎగ్జిబిషన్, 9న ఇండియా గేట్ నుంచి ఘట స్థాపన ఊరేగింపు, 10న బోనాల సమర్పణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మారుతీయాదవ్, బంగ్లా రాజుయాదవ్, విష్ణు గౌడ్, మాణిక్ ప్రభుగౌడ్, రాజు కుమార్‌యాదవ్, జె.లక్ష్మీనారాయణ గౌడ్, తిరుపతి నర్సింగ్ రావు, నర్సింగ్ గౌడ్ పాల్గొన్నారు.

28న నాంపల్లి ఏడుగుళ్ల మందిరంలో బోనాలు

నాంపల్లి: భక్తులు, దాతల సహకారంతోనే ఏడుగుళ్ల మందిరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దినట్లు శ్రీ ఏడుగుళ్ల పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని నాంపల్లి మార్కెట్‌లోని ఏడుగుళ్ల పోచమ్మ ఆలయంలో బోనాల పండుగ సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ అగర్వాల్ వార్షిక నివేదికను సమర్పించారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ..ఈ నెల 24న సల్లకుండ కార్యక్రమం ఉంటుందన్నారు. 28న బోనాలు, 29న రంగం, బలిగంప జరుగుతుందన్నారు. బి.నరేందర్, మల్లేష్, కాటేపాగ అనిబాబు, అరుణ్‌కుమార్, కిషన్ సింగ్, జైస్వాల్, జగపతి మహేష్, వెంకటేష్, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సుల్తాన్‌బజార్: గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచార్యులు దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరి శైలజ అయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు సమక్షంలో ఇటీవల పద్మశ్రీ అవార్డు గ్రహీతగా ఎన్నికైన దేవాదాయ శాఖలో స్థాపతిగా పనిచేసిన ఆనందచారివేలు, మాజీ కమిషనర్ అనీల్‌కుమార్‌కు వీడ్కోలు పలికి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ పరశురామ్ రవీంద్రచార్యులు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండారి జగపతి, కోశాధికారి సురేష్, కార్యవర్గ సభ్యులు గణేష్‌రాము పాల్గొన్నారు.

సాంస్కృతిక కళలను సంరక్షించుకోవాలి



గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ సంగీత కళలను పరిరక్షించుకోవాలని సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, నృత్య గురువు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ భాగవతుల సేతురామ్‌కు మీనాక్షి అమ్మ అవార్డును ప్రదానం చేశారు. అంతకు ముందు నృత్య గురువు డాక్టర్ పి.రమాదేవి శిష్యబృందం చేసిన గాంధారి స్వగతం, వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను ఆహుతులను ఆకట్టుకున్నాయి. పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమామహేశ్వరీ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నృత్య గురువు డాక్టర్ పసుమర్తి శేషుబాబు, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి



అబిడ్స్: విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమివ్వాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. సత్య సుందర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేగంబజార్ ప్రాంతంలోని షాహినాయత్‌గంజ్ పాఠశాల, మోహన్‌దాస్ మల్ పాఠశాలలతో పాటు పలు ప్రాంతాల్లో బ్యాగులు, స్టేషనరీ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ సింగ్, బద్రీనాథ్ సింగ్, సిరీష్ సింగ్, సోమరాజ్ సింగ్, గుణావత్ బండారి, నవీన్ అగర్వాల్, ఉమేష్ జైస్వాల్, నరేష్ సింగ్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బోనాల వేడుకలు


పూజలు చేస్తున్న తూంకుంట అరుణ్‌కుమార్ తదితరులు

అబిడ్స్/గోల్కొండ: బోనాల ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర కురుమ యువజన అధ్యక్షుడు తూంకుంట అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఏర్పాట్లు చేసిందన్నారు. ఆదివారం గోల్కొండ జగదాంబిక ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూంకుంట అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. అన్ని ఆలయాల వద్ద ప్రభుత్వం బోనాలకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, రామ్, నవీన్‌ముదిరాజ్, ధన్‌రాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మీరాలంమండిలో బోనాల ఉత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణం చేస్తున్న హంపీ పీఠాధిపతి

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో హంపీ పీఠాధిపతి విరూపక్ష విద్యారణ్య భారతి స్వామి ఆదివారం ధ్వజారోహణ చేసి బోనాల ఉత్సవాలను ప్రారంభించారు. అలాగే 20 రోజుల పాటు కొనసాగే రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ వరకు మహాయాగం పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పాటేల్ సదానంద్ యాదవ్, రాకేష్ తివారీ, కైలాస్ గంగపుత్ర, మధుసూదన్ యాదవ్, మధుసూదన్ గౌడ్, కోటిరెడ్డి, హన్స్‌రాజ్, కె.ఎస్.ఆనంద్‌రావు పాల్గొన్నారు.

నియామకం



గోల్కొండ: అఖిల భారత డయాలసేట్ మ్యాన్యూఫ్యాక్చరర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా టోలిచౌకీ సాలర్‌జంగ్ కాలనీకి చెందిన డాక్టర్ మహ్మద్ ఆఖీబ్ అహ్మద్ ఖాన్ ఎన్నికయ్యారు. నగరంలో ఇటీవల జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆయన ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ అసోసియేషన్ సమస్యలు, తమ ఉత్పత్తులపై త్వరలోనే తాము దేశ ఆరోగ్య మంత్రిని కలవనున్నట్లు తెలిపారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై ఆగస్టు 1న ఆటోబంద్


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ఆటోడ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 1న ఆటోబంద్ నిర్వహిస్తున్నట్లు షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటోడ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లా ఖాన్ వెల్లడించారు. ఆదివారం ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆర్టీసీ బస్సులలో మహిళల ఉచిత ప్రయాణం బదులు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటోబంద్ రోజున జంట నగరాల్లో డ్రైవర్లు ఆటోమీటర్లు తగలబెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధానంగా పొరుగు రాష్ట్రాలతో సమానంగా ఆటోమీటర్స్ ఛార్జీలు పెంచాలని కాంగ్రెస్ పార్టీ ప్రతి ఆటోకు రూ.12 వేల ఆర్థిక సాయం వెంటనే ఎన్నికల వాగ్దానం ప్రకారం చెల్లించాలని కోరారు. ఆర్టీఏ, పోలీస్ స్టేషన్లతో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మేము లంచాలు తీసుకోమని బోర్డులు పెట్టాలన్నారు. ఆగస్టు 1న నిర్వహించే ఆటోబంద్‌ను ఆటోడ్రైవర్లు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నేతలు లక్ష్మీనర్సయ్య, అంజనేయులు, ఆఫ్మీ, మహబూబ్ అక్తార్, షేక్ షరీఫ్, షేక్ రహీం, రజాక్, రమేష్, అజీముద్దీన్, లతీఫ్‌కాన్, మధుకర్, వెంకట్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర


పూజలు చేస్తున్న మనిలాల్‌షా, గజానంద్ చౌదరి


సయ్యద్ అలీ చబుత్ర నుంచి ప్రారంభమైన రథయాత్ర


చాంద్రాయణగుట్టలో కొనసాగుతున్న జగన్నాథ రథయాత్ర

అబిడ్స్: జగన్నాథ రథోత్సవ వేడుకలను ఆదివారం పలు ప్రాంతాల్లోని ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మనిలాల్‌షా, ఇతర నాయకులు గజానంద్ చౌదరి, రఘునందన్ గోప్, బాబేష్‌షా, పండిత్ దీన్‌దయాల్‌లు బేగం బజార్ కోల్సివాడిలోని జగన్నాథ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

చాంద్రాయణగుట్టలో..

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలో ఆదివారం జగన్నాథ స్వామి రథయాత్ర కనుల పండువగా కొనసాగింది. శ్రీ జగన్నాథుడు, సుభద్రాదేవి, బలబద్రులను భారీ రథంపై ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. ఈ రథయాత్రను కాశీ పీఠాధిపతి శ్రీ మఠం జగద్గురు రామానుజాచార్య రిగ్వేదాచార్యజీ ప్రారంభించారు. నిర్వాహకులు దామోదర్ దాస్ గోవింద్ కుమార్ లోహియా, గులాబ్‌రాయ్ కాంతిలాల్, జ్యోతిధర్ సింగ్ తదితరుల ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ఊరేగింపులో ఏసీపీ రుద్ర భాస్కర్, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గురునాథ్, ఎస్సై శ్రీనివాస్‌లు స్వాగతం పలికారు. శక్కర్‌గంజ్ పార్థివాడలోని ప్రాచీనమైన జగన్నాథ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన యాత్రలో స్థానిక నాయకులు ఆదర్శ మహేష్, డోంకి యాదగిరి, ప్రవీణ్ బాగ్డే, నిర్వాహకులు సురేష్ కుమార్, రాజేష్, రవి కుమార్, ఎ.మధుసూదన్, ప్రదీప్, అర్జున్, కె.దేవేందర్, దయానంద్ పాల్గొన్నారు.

సాక్షి, సిటీబ్యూరో: రాధాకృష్ణ ఆత్మరామ మందిరం వారు ఆదివారం జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ రథయాత్ర ఇస్కాన్ టెంపుల్ సయ్యద్ అలీ చబుత్ర నుంచి మొదలై లాల్‌దర్వాజా, బాలాగంజ్, గౌలిపురా, సుధా టాకీస్ మీదుగా తిరిగి మందిరానికి చేరుకుంది. ఈ రథయాత్రలో రాజేష్‌కుమార్ సింగ్, నీరజ్ సింగ్, శ్రవణ్ కుమారు తదితరులు పాల్గొన్నారు.

గన్‌ఫౌండ్రీ: ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్ర కనుల పండువగా సాగింది. ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమైన యాత్ర హిమాయత్‌నగర్, బషీర్‌బాగ్, అబిడ్స్, ఎంజేమార్కెట్ ప్రాంతాల మీదుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద ముగిసింది. అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మహా హారతి, కచేరి, ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ టెంపుల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సభ్యులు వేదాంత చైతన్యదాస్, వరద కృష్ణదాస్, శంభు వైష్ణవ దాస్ పాల్గొన్నారు.

బోనాలకు ఆహ్వానం


చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ పలువురు అధికార, అనధికార ప్రముఖులకు ఆహ్వానాలను అందజేస్తున్నామని.. ఇందులో భాగంగా తెలంగాణ కౌన్సిల్ మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్‌కు ఆహ్వానం అందజేశామన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఈనెల 24న నిర్వహించే శాఖాంబరి పూజల్లో పాల్గొనాలని ఆహ్వానించినట్లు మధుసూదన్ గౌడ్ తెలిపారు.

మై ఐటీ రిటర్న్ యాప్ ప్రారంభం



అఫ్జల్‌గంజ్: వినియోగదారుల సౌకర్యార్థమే మై ఐటీ రిటర్న్ యాప్‌ను ప్రారంభించినట్లు స్కోరిడోవ్ వ్యవస్థాపకుడు సాకార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సంచలనాత్మక యాప్‌ను స్కోరిడో సంస్థ ద్వారా ప్రారంభించామన్నారు. మై ఐటీ రిటర్న్‌లో పన్ను దాఖలను సులభంగా, సురక్షితంగా, సమర్థవంతంగా చేయడమే లక్ష్యమన్నారు. వినియోగదారుల డేటా భద్రతను నిర్ధారిస్తూ, వారికి సాధ్యమే గరిష్ట వాపసును అందిస్తూ మొత్తం ప్రక్రియను సులభతరంగా చేసేందుకు తమ యాప్ ఉపయోగపడుతుందన్నారు. కేవలం రూ.99కే పన్ను ఫైలింగ్ చేస్తామన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



సుల్తాన్‌బజార్: తమ మాతృమూర్తి పేరిట ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం జాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తమ తల్లి పేరిట మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, అమర్‌సింగ్, ఆనంద్, సుధీర్, మయూర్, కాజల్, రేణుకా, సందీప్ తదితరులు పాల్గొన్నారు.